# మనసులోని మాట

— జి. ఉషా విఠల్

ఏమైనా సరే దీప్తితో ఇవాళ నా మనసులో మాట చెప్పేయాల్సిందే. లేకపోతే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చంద మవుతుంది. ఇంతకంటే మంచి అవకాశం ముందు ముందు వస్తుందో, రాదో? అనుకుంటూ టై కట్టుకున్నాను. కోటు వేసుకుని, నిలువు టద్దంలో నన్ను నేను ఒకసారిపరీక్షగా చూసుకున్నాను.

ఎన్నోసార్లు కాన్ఫరెన్సులూ గట్రా అటెండ్ చేసినప్పుడు నీట్‌గా డ్రెస్ చేసుకోవడం అలవాటే కాని ఎప్పుడూ ఇంత శ్రద్ధ తీసుకోలేదు. అసలు ఆ రోజు వేసుకోవలసిన డ్రెస్ సెలెక్ట్ చేసుకోడానికే నాకు గంట పట్టింది. నిలువు టద్దంలో నా ప్రతిబింబాన్ని మరోసారి తృప్తిగా చూసుకుని, టేబుల్ డ్రాయర్ తెరిచి అందులోని చిన్న ముఖమల్ పెట్టె తీసి జేబులో వేసుకున్నాను. దానిలో దీప్తి కోసం పుట్టిన రోజు బహుమతిగా కొన్న ఎర్ర రాయి ఉంగరం ఉంది. ఇంతదాకా నే నెప్పుడూ ఏ ఆడపిల్లకీ, ఏ బహుమతీ ఇవ్వలేదు. ఆఖరికి లీలకు కూడా!

లీల నా మనసులోకి రాగానే నా మనసు ముడుచుకుపోయింది. దీప్తికి నా మనసులోని మాట చెప్పా లనుకున్నప్పు డల్లా లీల నా ముందు ప్రత్యక్షమై నన్ను డిస్టర్బ్ చేస్తూ ఉంటుంది. అందుకు కారణం నా సెంటిమెంటల్ మెంటాలిటీయే నేమో! నా జ్ఞాపకాలలోకి చొచ్చుకు రాబోతున్న లీలని బలవంతంగా బయటికి నెట్టేసి స్కూటర్ బయటికి తీశాను.

** ** **

"ఏయ్ మొద్దూ! అలా నేల చూపులు చూస్తూ నిలుచోవడమేనా? లేకపోతే నన్ను అతనికి పరిచయం చేయడ మేమైనా ఉందా?" అంటూ చేతిలో కూల్ డ్రింక్ ట్రేతో మా ముందుకు వచ్చి నిల్చున్న పెద్ద కళ్ళ అమ్మాయిని ఆశ్చర్యంగా చూశాను.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆకుపచ్చని పంజాబీ డ్రెస్‌లో అప్పుడే విచ్చుకున్న సంపెంగ పువ్వులా ఉం దా అమ్మాయి. భుజాల దాకా ఉన్న కత్తిరింపు జుట్టుని రెండు పిన్నులు పెట్టి వదిలేసింది. మెడలో వెండితో చేసిన నెక్‌లెస్, చేతి కో దంతం గాజు, చెవులకి వెండి లోలకులూ, హిందీ సినిమా హీరోయిన్ని జ్ఞాపకానికి తెస్తోం దా అమ్మాయి అలంకరణ.

మెడలో దిగేసుకున్న బండెడు నగలు, ముదురు రంగు పట్టు చీరలో ముడుచుకుపోయి నా పక్కన నిలుచున్న లీల ఆ క్షణంలో ఆ అమ్మాయి ముందు అమ్మమ్మలా కనిపించడం ఆశ్చర్యం కాదు. ఆ అమ్మాయి మాటలకి లీల మరింత ముడుచుకుపోతూ - "నా ఫ్రెండ్ దీప్తి!" అంది దీప్తి చేతిలో ఉన్న కూల్ డ్రింక్స్ మా ఇద్దరికీ ఇస్తూ.

"ఏడిచినట్టుందిది నీ పరిచయం చెయ్యడం! చూడండి శ్రీధర్‌గారూ! లీలా, నేనూ అయిదో క్లాసు నుంచీ ... అయిదో క్లాసే కదే? " అంటూ స్నేహితురాలి దగ్గర నుంచి కన్ఫర్మేషన్ కోసం ఆగి, లీల తల ఊపగానే , "అయిదో క్లాసు నుంచీ బి.కామ్. దాకా కలిసి మెలిసి చదువుకున్నాం. కలిసి మెలిసి కాపీలు కొట్టాం! కాలేజీ కేంటీన్‌లో ఒకే ప్లేటులో చెరో వైపు నుంచీ స్పూన్లతో టిఫెన్లు తిన్నాం. లెక్చరర్ల చేత చీవాట్లు కూడా అలాగే తిన్నాం! కాకపోతే మా ఇళ్ళు చాలా దూరం అవటం చేత ఒకే మంచం మీద పడుకోలేకపోయా మనుకోండి" అంటూ ఉంటే - "దీప్తీ! మీ కాలేజీ ఫ్రెండ్స్ వచ్చారు. వెళ్ళి పలకరించు తల్లీ!" అంటూ లీల తల్లి సుబ్బాయమ్మగారు పిలిచారు.

దాంతో "శ్రీధర్‌గారూ! సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్ అన్న విషయం గురించి మరోమారు మాట్లాడుకుందాం!" అంటూ వెళ్ళిపోయింది.

"వట్టి వాగుడుకాయ !" అంటూ నవ్వబోయిన లీల, తల్లి సుబ్బాయమ్మగారిని చూసి తల వంచేసుకుంది. దీప్తితో నా పరిచయం అలా లీలతో నా ఎంగేజ్‌మెంట్ రోజున, వేసవి సంధ్యలో తెలి మబ్బుల మధ్య మెరిసిన మెరుపులా జరిగింది. ఆ తర్వాత ఆ రోజంత మరిచిపోదా మన్నా దీప్తిని మరిచిపోలేకపోయాను. లీలతో పెళ్ళికి ఒప్పుకుని దీప్తి గురించి ఆలోచించడం అన్యాయ మనిపించి, నా మనసుని బలవంతంగా లీల వైపు తిప్పుకున్నాను.

** ** **

"హల్లో! శ్రీధర్! ఏమిటి ఇలా వచ్చారు?" అన్న పలకరింపు విని అప్పటికి పది నిముషాల నుంచి ఆఫీసర్ దర్శనం కోసం పి.ఏ. రూమ్‌లో కూర్చుని తపను చేస్తున్న నేను తల తిప్పి చూశాను. ఎదురుగా దీప్తి! చేతిలో ఏవో రిజిస్టర్స్‌తో నవ్వుతూ నిల్చుని ఉంది.

" మీరా! వా టే సర్‌ప్రైజ్! మీరు ఈ ఆఫీసులో పనిచేస్తున్న సంగతి ..." అంటూ ఉంటే దీప్తి అందుకుని -

"మరిచిపోయా రన్న మాట! పోనీలెండి! ఊరక రారు మహానుభావులు అన్నారు. తమరు మా ఆఫీసు పావనం చేస్తున్న సందర్భం ఏమిటో తెలుసుకోవచ్చా?" అంది.


"మా కంపెనీ అయిటమ్ ఒకటి సప్లై చేశాం. ఇంతదాకా పేమెంట్ అవలేదు. కనుక్కుని పోదామని వచ్చాను. చూస్తే మీ ఆఫీసర్ మీటింగ్‌లో ఉన్నాడుట" అన్నాను.

దీప్తి చేతిలో ఉన్న రిజిస్టర్స్ పక్కనున్న టేబుల్ మీద పడేస్తూ - "ఈ మాత్రం దానికి ఆఫీసర్ ఎందుకు లెండి. మీ సప్లై వివరా లున్నాయా?" అని అడిగింది. నేను నా ఫైల్లో నుంచి కాపీ తీసి ఇచ్చాను.

సప్లై డేటు చూసి - "సప్లై చేసి చాలా రోజు లైందే! ఇంతకాలం పేమెంట్ చేయకుండా ఉండరు. ఏదో పొరపాటు జరిగి ఉండాలి కనుక్కుందాం రండి!" అంటూ దారితీసింది.

ఎక్కడికో తెలియకపోయినా నేను ఆమెని అనుసరించాను. దీప్తి ఆఫీసర్ గదికి పక్కనున్న మరో గదిలోకి వెళుతూ, సంశయిస్తూ నిల్చున్న నన్ను చూసి - "లోపలికి రండి! ఇక్కడ పులు లేం లేవు!" అంది.

నేను మ రేం ఆలోచించకుండా లోపలికి వెళ్ళాను. లోపలికి అడుగుపెట్టిన మమ్మల్ని చూసి, కంప్యూటర్ ముందు కూర్చుని ఉన్న అమ్మాయి - "హాయ్ దీప్తీ! వాట్ కెన్ ఐ డూ ఫర్



యూ?'' అంది.

దీప్తి ఆ అమ్మాయి చేతిలో బిల్ కాపీ పెడుతూ ''సునీత ! ప్లీజ్ చెక్ వెదర్ దిస్ పేమెంట్ హేజ్ బీన్ మేడ్'' అంది.

ఆ అమ్మాయి కంప్యూటర్ కీబోర్డు మీద వేళ్ళు టకటక లాడిస్తూ - ''ప్రింట్ అవుట్ కావాలా?'' అని అడిగింది.

దీప్తి కావాలీ అని చెప్పగానే పేమెంట్ తాలూకు వివరా లన్నీ ప్రింట్ చేసి, కాగితా న్ని ప్రింటర్‌లో నుంచి చించి దీప్తి చేతిలో పెట్టింది.

''ఇదిగో ఈ డేటుకి, ఈ నంబరున్న చెక్‌ని ఈ అడ్రసుకు పంపించారు'' అంది దీప్తి దాన్ని నాకు చూపిస్తూ.

ఆ కాగితంలో ఉన్న అడ్రసు మా హెడ్డాఫీసుది.

''చెక్ హెడ్డాఫీసుకి పంపించేశా రన్న మాట! థాంక్ గాడ్! ఈ పేమెంట్ గురించి ఎన్ని అవస్థలు పడాల్లో అని భయపడి చచ్చాను. దీప్తీ! మీ సహాయానికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదు'' అన్నాను మనస్ఫూర్తిగానే.

''భలేవాళ్లే! ఇ దొక పెద్ద సహాయమా! బై ది బై లీల ఎలా ఉంది?'' అని అడిగింది. లీల మాట రాగానే అనుకున్న పని అయిం దన్న నా సంతోష మంతా ఎగిరిపోయింది.

''ఆ సంగతి మీకు తెలియాలి'' అన్నాను. అలా అంటున్నప్పుడు నా మొహం ముడుచుకుపోయిం దేమో.

దీప్తి ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ - ''అ దేమిటి? ఈ మధ్య మీరు లీలని కలవలేదా?'' అని అడిగింది.

లీల గురించి మాట్లాడటానికి ఆ ఆఫీసు వరండా సరైన స్థలం కా దనిపించి - ''మీకు క్యాంటీన్ ఉందా?' అని అడిగాను.

తన ప్రశ్నకి సరైన సమాధానం రానిందుకు దీప్తి చిన్నబుచ్చుకుని - ''ఉంది'' అంది.

''పదండి వెళ్లదాం!'' అన్నాను అడుగు ముందుకు వేయబోతూ.

''మా ఆఫీసర్ మంచివాడే కానీ, సప్లయర్స్‌తో కేంటీన్‌లో మంతనా లాడటం సహిస్తా డనుకోను''

## గుహాప్రవేశం

పాత రికార్డులు బద్దలుకొట్టి, కొత్త రికార్డులు సృష్టించి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కా లనే తపన ఎందరిలోనో ఉంటుంది. అందులో పాశ్చాత్య దేశాలలో మరీను. ఈ ప్రయత్నంలో ఎందరో ప్రాణాలు కోల్పోతే, మ రెందరో తమని తాము ఏన్నెన్నో ఇబ్బందులకు గురిచేసుకుంటుంటారు. అటువంటివి ఒక్కొక్కప్పుడు వింటేనే ఒళ్ళు గగుర్పొడిచేటట్లు ఉంటాయి.

1972లో మైకేల్ సిఫ్రె అనే ఒక ఫ్రెంచి వ్యక్తి అమెరికాలోని టెక్సాస్‌లో ఒక గుహలో ఏకాంతంగా 203 రోజులు గడిపి వచ్చాడు. అది అన్ని రికార్డులనూ మించడంతో గిన్నీస్ బుక్‌లోకి ఎక్కింది. ఈ రికార్డును త్రోసిరాజనా లనుకున్నాడు ఇటలీకి చెందిన 33 ఏళ్ళ మేరిజియో మోంటాల్బిని. ఇతగాడు 1986 డిసెంబర్ 14న ఇటలీలోని అన్కోనా సమీపంలోని ఫ్రసాస్ గుహాలలో 'గుహ ప్రవేశం' చేసి 210 రోజులు ఒంటరిగా గడిపి వెలుపలకు వచ్చాడు. అంతటితో పాత రికార్డు బద్దలు కావడంతో గిన్నీస్ బుక్‌లో స్థానం దొరికింది.

- కె.ఆర్.కె. మోహన్

అంది మళ్ళీ తనే మామూలు ధోరణిలోకి వచ్చేస్తూ.

నేను నవ్వి, ''మీ కళ్ళకి నేను లంచం ఇచ్చే సప్లయర్‌లాగా కనబడుతున్నానా?'' అని అడిగాను.

''మరి? నా మాటలకి సమాధానం చెప్పకుండా క్యాంటీన్‌లో మాట్లాడుకుందాం అంటే అర్థం అదే!'' అంది దీప్తి చిలిపిగా నవ్వుతూ.

''ఆ రోజు ఫంక్షన్ తర్వాత నేను లీలని చూడలేదు. ఎందుకు కలవలేకపోయానో మీరు మీ స్నేహితురాల్నే అడిగి తెలుసుకోవడం మంచిది. నేను ఆ విషయా లన్నీ చెప్పడం బాగుండదు'' అన్నాను.

దీప్తికి నా మాటలు అర్థం కాలే దేమో. నా వైపు అయోమయంగా చూస్తూ - ''ఏమైనా గొడవలా?'' అని అడిగింది.

''గొడవలా? ఛా! అ దేం కాదు.. మీ స్నేహితురాలిని వెళ్ళి అడగండి. వీలైతే ఆమె ఏం చెప్పిందో నాతో వచ్చి చెప్పండి. ఇంతకీ మీరు కాంటీన్‌కి వస్తారా, లేదా?'' అన్నాను కొంచెం అసహనంగా.

అప్పటికే అటుగా వెళ్తున్న వా ళ్ళందరూ మమ్మల్ని కుతూహలంగా చూస్తూ ఉండటం నాకు చిరాకు కలిగించింది.

దీప్తి అది గమనించి - ''ఇప్పుడు సెక్షన్ వదలాలంటే పర్మిషన్లూ, గట్రా తీసుకోవాలి. నా ప్రశ్నలతో మిమ్మల్ని విసిగించా నేమో కదూ?'' అంది.

''ఛా! ఛా! అ దేం లేదు'' అంటూ ఆమెకి మరోసారి కృతజ్ఞతలు చెప్పుకుని వచ్చేశాను.

అది దీప్తితోనా రెండవ సమాగమం!

** ** **

దీప్తి లీల గురించి జ్ఞాపకం చేయడంతో నా మనసు చికాగ్గా తయారైంది. ఆఫీసులో అన్యమనస్కంగా ఏదో పనిచేస్తున్నానే గానీ, మనసు పని మీద లేదు. ఎంగేజ్‌మెంట్ రోజున దీప్తిని చూసిన తర్వాత అప్పుడప్పుడూ లీల దీప్తిలాగా ఫ్రీగా ఉండకూడదూ అనిపించేది. లీల అతి సిగ్గు జ్ఞాపకం వచ్చినప్పుడు ఎక్కడ లేని విసుగూ కలిగేది.

ఎంగేజ్‌మెంట్ అయిన పది రోజుల తర్వాత అనుకుంటాను - ఒకరోజు వాళ్ళ వీధి మీదుగా వెళుతూ లీలను చూసిపోదా మనిపించి వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అక్కడ నేను ఉన్నంత సేపూ లీల బయటికి వస్తేనా? ఎంతసేపూ లీల తల్లి సుబ్బాయమ్మగారే మాట్లాడింది.

అప్పటికీ ఉండబట్టలేక ''లీల లేదా?'' అని అడిగాను.


దానికి ఆవిడ ''ఉంది'' అని మాత్రం సమాధానం చెప్పింది గానీ లీలని బయటికి పిలిచే ప్రయత్నం చేయలేదు. చేసేది లేక సుబ్బాయమ్మ గా రిచ్చిన కాఫీ తాగేసి, పళ్ళు నూరుకుంటూ వచ్చేశాను. సుబ్బాయమ్మగారు చాదస్తం మనిషి అయి ఉండచ్చు కానీ ఈ లీల కేం రోగం? కాబోయే భర్తతో రెండు మాటలు మాట్లాడితే తన సొమ్మేమైనా పోతుందా? అనుకున్నాను కసిగా. మళ్ళీ ఆశ చావక మరో రోజు స్నేహితుడి పెళ్ళికి లీలని తీసుకు వెళదా మని వెళితే అప్పుడూ సుబ్బాయమ్మగారే -

''ఆ మూడు ముళ్ళూ పడ్డాక నీ ఇష్టం వచ్చిన చోటుకు తిప్పుకో నాయనా! కానీ ఇప్పుడు మాత్రం కుదరదు'' అంటూ కచ్చితంగా చెప్పేసింది.

ఆ రోజూ లీల కనిపించలేదు.

ఏ తలుపుచాటునో నిలుచుని నా వెర్రిమొహాన్ని చూసి నవ్వుకుంటూ ఉండి ఉంటుం దనుకున్నాను విసుగ్గా. ఆ తర్వాత లీల కో ఉత్తరం రాశానుగానీ దాన్ని సుబ్బాయమ్మగారే చదువుతుం దేమో ననే భయంతో పోస్టు చేయలేదు.

ఎంగేజ్‌మెంట్ రోజు దీప్తి పరిచయం నా మనోగీతంలో పలికించిన అపశ్రుతిలో ముడుచుకుపోయిన నా మనసు, లీల ప్రవర్తనతో మరింత మూగబోయింది. అందుకే లీలని గురించి దీప్తి అడిగినప్పుడు నాకు తెలియకుండానే సమాధానాలు కాస్త కరుగ్గా



వచ్చాయి.

లీల ప్రవర్తనతో విసిగెత్తిపోయిన నాకు ఈ రోజు అలా హఠాత్తుగా మళ్ళీ దీప్తి కనిపించగానే మనసు వశం తప్పింది. పెళ్ళి చూపుల్లోనూ, ఎంగేజ్‌మెంట్ రోజునా చూసీ చూడనట్టు చూసిన లీల రూపం నా మనసులో మసకబారసాగింది. ఆ రాత్రి విసుగ్గా క్యాలండర్‌లో తేదీలు లెక్కపెట్టాను. పెళ్ళికి ఇంకా రెండు నెలలలు ఉంది. దీప్తిని మనసులో నుంచి తీసేసి, లీలని జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించి పూర్తిగా ఓడిపోయాను.

** ** **

ఆ తర్వాత ఆశ్చర్యంగా మరో రెండు రోజుల్లోనే దీప్తిని నేను సినిమా థియేటర్‌లో కలవడం జరిగింది. నా అభిమాన హీరో సినిమా రిలీజ్ అయిం దని తెలిసి, ఆఫీసుకు సెలవుపెట్టి వెళ్ళిన నాకు, చాంతాడు లాంటి క్యూ చూడగానే ఎక్కడ లేని నీరసం వచ్చింది. అన్యాయంగా సెలవు వేస్టయిపోయిందే అని బాధపడుతూ తెలిసిన వా శ్నెవరైనా కనిపిస్తా రేమో నని దిక్కులు చూస్తూ నిల్చున్నాను.

ఇంతలో పక్కనున్న కుర్రాడు - "మాస్టారూ! మిమ్మల్ని అక్క డెవరో పిలుస్తున్నారు చూడండి!" అని చెప్పేసరికి టికెట్ కౌంటర్ వైపు చూశాను. దీప్తి! దూరం నుంచి చెయ్యి ఊపి పిలుస్తోంది. గబగబ అటు అడుగులు వేశాను.

"అబ్బ! మీరు ఇటువైపు చూసేట్టు చెయ్యడానికి నేను ఎన్ని అవస్థలు పడాల్సి వచ్చిందో తెలుసా? క్యూలోని వాళ్ళకి సినిమాకి ముందే మంచి ఎంటర్‌టైన్‌మెంట్ దొరికినట్లయింది. చప్పట్లు చరిచినా లేదు, పిలిచినా లేదు. ఎంత పరధ్యానం బాబూ! ఆఁ అవునూ? ఇంత ఆలస్యంగా వస్తే టిక్కెట్లు ఎలా దొరుకుతా యనుకున్నారు?" అంది దీప్తి నన్ను చూడగానే గల గల మాట్లాడేస్తూ.

"మీరు క్యూలో నిల్చుని నా కోసం టిక్కెట్టు కొని వెయిట్ చేస్తున్నట్టు నిన్న రాత్రి నాకు కల వచ్చిందిలెండి! మనం కూడా ఎందుకు ఎండలో తిప్పలు పడటం అని నెమ్మదిగా వచ్చాను" అన్నాను నేను కూడా సరదాగా.

దీప్తితో ఉన్నప్పుడు సీరియస్‌గా ఉండటం కష్టం.

నా మాటలకి దీప్తి నవ్వేస్తూ - "అబ్బ! ఎంత ఆశ! నిజానికి కౌంటర్ క్లర్క్‌కి మనిషి కో టిక్కెట్టు మాత్రమే ఇవ్వాలని మేనేజర్ నిన్న రాత్రి కలలోకి వచ్చి చెప్పా డట!" అంది.

ఆ మూడు, నాలుగు గంటల సేపు సినిమా బాగుండటం వల్ల త్వరగా గడిచిపోయిందో, లేక దీప్తి కంపెనీ వల్ల త్వరగా గడిచిపోయిందో నాకు తెలియలేదు. సినిమా అయిన తర్వాత దీప్తి నన్ను వాళ్ళ ఇంటికి తీసుకు వెళ్ళింది. వాళ్ళ అమ్మనీ, నాన్ననీ, తమ్ముడినీ పరిచయం చేసింది. ఆ రోజు నేను గమనించిన సంగతి ఏమిటంటే దీప్తి ఒక్కసారి కూడా లీల విషయం ఎత్తకపోవడం.

నాకు అది సంతోషాన్నే కలిగించింది. నా జీవితంలోకి రావలసింది దీప్తి లాంటి చురుకైన పిల్లగాని అమ్మమ్మ లాంటి లీల కాదని ఆ రోజే కచ్చితంగా నిర్ణయం చేసుకున్నాను. దీప్తితో మరికొంచెం పరిచయం పెరిగిన తర్వాత మనసులోని మాట దీప్తితో చెప్పి, ఆమె ఒప్పుకుంటే లీలతో నా ఎంగేజ్‌మెంట్ క్యాన్సిల్ చేసుకోవాలని కూడా అప్పుడే అనుకున్నాను. అలా అనుకోగానే నా మనసులోని ఆరాటం తగ్గినట్టనిపించింది.

** ** **

దీప్తిలాంటి అమ్మాయితో పరిచయం వృద్ధి చేసుకోవడం పెద్ద కష్ట మేమీ కాదు. వారం రోజుల్లోనే నేను నాలుగుసార్లు అనుకోకుండా షాపింగ్ సెంటర్‌లోనూ, హోటల్లోనూ, బస్టాండ్‌లోనూ, ఇంటిదగ్గరా దీప్తిని కలిశాను. దీప్తి ధోరణి నాకు కావలసిన ధైర్యా న్నిచ్చినా, నాకు సరైన అవకాశం మాత్రం దొరకలేదు. దీప్తి ఎక్కడ కనిపించి నా స్నేహితురాళ్ళతోనో, తమ్ముడితోనో, తల్లితోనో కనిపించేది. ఇదిగో ఇన్నాళ్ళకి నా మనసులోని మాట చెప్పడానికి దీప్తి పుట్టినరోజు పార్టీ అనే ఈ అవకాశం వచ్చినట్లైంది. ఎలాంటి పరిస్థితులలోనూ ఈ ఛాన్సు పోగొట్టుకోకూడ దని కచ్చితంగా నిర్ణయించుకున్నాను. అందుకే మిగతా అతిథులు వచ్చే లోపలే దీప్తితో నా మనసులోని మాట చెప్పేయా లనే ఆత్రతతో కాస్త తొందరగా బయలుదేరాను.

** ** **

స్కూటర్ స్టాండ్ వేసి వరండాలోకి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. తలుపు తెరిచిన దీప్తిని చూసి నన్ను నేనే మరిచిపోయినట్టు అలా నిలబడిపోయాను.

నీలం రంగు జీన్స్ పేంట్, పసుపు రంగు బేగీ టీ షర్టు, పైకి ఎత్తి క్లిప్పులు బిగించిన పోనీ టైల్, లిప్‌స్టిక్‌తో మెరుస్తున్న పెదాలు! ఆ క్షణంలో దీప్తి నా కళ్ళకి ఎంతో అందంగా కనిపించింది. తలుపు తియ్యగానే నన్ను చూసి -

"హాయ్ శ్రీధర్! కమిన్!" అంటూ లోపలికి ఆహ్వానించింది. నా కేమిటో కంగారుగా ఉంది. నా మనసులోని మాట ఎలా చెప్పాలి? ఎప్పుడు చెప్పాలి? అని మథనపడుతూ దీప్తి వెనుకే నడిచాను.

దీప్తి హాల్లో ఉన్న సోఫా చూపించి "కూర్చోండి! అయిదు నిముషాల్లో వచ్చేస్తాను" అంది లోపలికి వెళ్ళబోతూ. హాల్లో ఎవరూ లేరు. మరి కాసేపు అయితే మిగతా అతిథులు ఎవరైనా రావచ్చును. ఈ అవకాశం వదులుకుంటే మళ్ళీ దీప్తితో నాకు ఏకాంతం దొరక్కపోతే?


నేను పొడారిపోతున్న గొంతుకని ఎలాగో పెగుల్చుకుని - "దీప్తీ! మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అన్నాను.

"దీప్తి నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ - "నేనూ మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి! బట్ నాట్ నౌ!" అంది. ఆ మాట వినగానే గుండె ఒక్క పిల్లిమొగ్గవేసి అతి వేగంగా కొట్టుకోసాగింది. కాని ముందు నా మనసులోని మా చెప్పేయా లనే ఆత్రతతో - "దీప్తీ! ఒక్క అయిదు నిముషాలు స్పేర్ చెయ్యి! మళ్ళీ ఎవరైనా వస్తే నేను చెప్పదలుచుకున్నది చెప్పలేకపోవచ్చు దీప్తీ! ఐ ... నేను ..." అంటూ నోరు తెరిచి ఆగిపోయాను.

హాల్లులో నుంచి లోపలి గదిలోకి వెళ్ళే గుమ్మం దగ్గర లీల, పక్క నో అందమైన యువకుడు వచ్చి నిలబడి ఉన్నారు. తెల్లని చాందినీ డ్రెస్‌లో లీల అరవిరిసిన మల్లెపువ్వులా, స్వచ్ఛంగా, అందంగా, చాందినీ సినిమాలో శ్రీదేవిలాగ. లీల ఇంత అందంగా నాజూగ్గా ఎలా ఉంది? ఇది సాధ్యమేనా? తెల్లబోయి చూస్తున్న నా చూపులు చూసి దీప్తి చటుక్కున వెనక్కి తిరిగి చూసి -

"ఓ! లీలా! అలా నిలబడిపోయా వేం? శేఖర్! ఈయన శ్రీధర్, లీల వుడ్ బి! శ్రీధర్, మీట్ శేఖర్! నా ఫియాన్స్! మీలా మాకు ఫార్మల్ ఎంగేజ్‌మెంట్ కాలే దనుకోండి!" అంది. ఆ మాటలు విన్న నా గుండెల మీ దో మంచు ముక్క పెట్టినట్టయింది.

"లీల నాతో అంత చెప్పింది శ్రీధర్! లీలకి



తండ్రి లేడని మీకు తెలుసుగా? వాళ్ళమ్మకి ఎప్పుడూ ఎవ రేమనుకుంటారో నన్న భయమే. అలాగే లీలను తన రెక్కల చాటున కోడిపిల్లలా పెంచింది. లీల మీతో మాట్లాడటం చుట్టుపక్కల వాళ్ళు చూసి తప్పు పట్టించుకుంటా రేమో ననే భయంతో ఆవిడ లీలని మీ ముందుకు రానివ్వలేదు. వాళ్ళింట్లో అయితే ఆవిడ లీలని మీతో మాట్లాడ నివ్వలేదని గ్రహించే, పుట్టిన రోజు పార్టీ పేరుతో మిమ్మల్ని ఆహ్వానించి, లీలని ఇక్కడికి లాక్కొచ్చాను.''

దీప్తి మాటలు నా చెవులకి ఎక్కడం లేదు. లీలనే చూస్తుండిపోయాను. ఒక్క మాట నా పెదవి దాటిపోయి ఉంటే ఎంత అనర్థం జరిగిపోయేదో? ఒక పక్క నా కాబోయే భార్య లీల, మరో పక్క దీప్తికి కాబోయే భర్త శేఖర్.

అయినా అసలు లీలని చూసిన క్షణమే - ''దీప్తీ! నిన్ను ప్రేమిస్తున్నాను'' అన్న నా మనసులోని మాట సెగ తగిలిన మంచు బిందువులా ఆవిరి అయిపోయింది. ★

